


TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ
# శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 140 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శనివారం 26 అక్టోబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## తెలంగాణ స్పోర్ట్స్ పాలసీపై
# సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- పది రోజుల్లోగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీకి గవర్నింగ్ బాడీని ఖరారు
- తెలంగాణ క్రీడా విధానంపై ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి



**శాసనసభ / హైదరాబాద్ :** జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన యువత సత్తా చాటేలా తెలంగాణ క్రీడా విధానానికి సంబంధించిన తుది ముసాయిదాను నవంబర్ నెలాఖరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ క్రీడా విధానంపై ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ శుక్రవారం సమీక్షించారు. ఈ విధానంలో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ (Young India Physical Education and Sports University - YIPESU)కి సంబంధించిన బిల్లు సాధ్యమైనంత త్వరగా రూపొందించా లని ఆదేశించారు. మరో పది రోజుల్లోగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి. అత్యుత్తమ క్రీడా విధానం కోసం దక్షిణ కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు.

మిగతా »»2లో

## యుద్ధ భూమిలో
### సమస్యలు పరిష్కారం కావు



**ఢిల్లీ / శాసనసభ :** ఉక్రెయిన్,పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఆయా ప్రాంతాల్లో శాంతి స్థాపన దిశగా కృషి చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. భారత్- జర్మనీ 7వ 'ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్' చర్చల్లో భాగంగా భారత్ పర్యటనకు వచ్చిన జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్‌తో దిల్లీలో భేటీ సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్- రష్యా మధ్య సుదీర్ఘంగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారం దిశగా భారత్ చొరవ చూపాలని ఒలాఫ్ విజ్ఞప్తి చేశారు." ఉక్రెయిన్, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి.

మిగతా »»2లో

## విద్యుత్ సంస్థల కోసం చేసే
# ఖర్చు భారం కాదు..
## ప్రభుత్వ బాధ్యత..



### - కాంగ్రెస్ సర్కార్‌కు కేటీఆర్ సూచన

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ఏర్పడిన నాడు మనం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ఇందిర పార్క్ వద్ద ధర్నాలకు దిగిన పరిస్థితి ఉండేదని..మరోవైపు రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న పరిస్థితి ఉందని గుర్తు చేశారు. సిరిసిల్లలో కూడా పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్‌తోనే ముడిపడి ఉందన్నారు.

మిగతా »»2లో

# మా బాధలను అర్థం చేసుకోండి..
## సచివాలయాన్ని ముట్టడించిన బెటాలియన్ పోలీస్ కుటుంబాలు




**శాసనసభ / హైదరాబాద్ :** గత కొన్నిరోజులుగా జిల్లాల్లో కొనసాగుతున్న బెటాలియన్ పోలీస్ కుటుంబాల ఆందోళనలు హైదరాబాద్‌కు వ్యాపించాయి. బెటాలియన్ పోలీస్ కుంటుంబాల సభ్యులు సచివాలయ ముట్టడికి యత్నించారు. సెక్రటేరియట్ ముందు బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఒకే దగ్గర విధులు నిర్వర్తించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరితో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఏక్ పోలీస్ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ కుటుంబ సభ్యుల బాధలను అర్థం చేసుకోవాలన్నారు.

## రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో
### కూటమి అభ్యర్థులు గెలిచేలా పనిచేయాలి



- త్వరలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నేతలతో చంద్రబాబు భేటీ
- టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం

2

## అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి!:
## బీజేపీ పనేనంటూ ఆప్ ఆరోపణ



**ఢిల్లీ /శాసనసభ:** ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి యత్నం జరిగింది. శుక్రవారం వికాస్‌పురిలో కేజ్రీవాల్ పాదయాత్ర చేస్తున్న సమయంలో ఈ దాడి ఘటన చోటు చేసుకుంది. కొందరు బీజేపీ గూండాలు అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి పాల్పడ్డారని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. బీజేపీ గూండాలు వచ్చి అరవింద్ కేజ్రీవాల్ పై దాడికి యత్నించినా.. పోలీసులు వారిని అడ్డుకోలేదని ఆరోపించారు.

మిగతా »»2లో

### మూడు నెలలు అక్కడ ఉంటా...
## రేవంత్ రెడ్డి సవాల్‌ను
# స్వీకరిస్తున్నా



- మూసీ ప్రాంత ప్రజల కోసం అక్కడ ఉండేందుకు సిద్ధమేనన్న కిషన్ రెడ్డి
- హామీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆగ్రహం
- మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదన్న కిషన్ రెడ్డి

2లో

## తెలంగాణలో పత్తి రైతులకు
# వాట్సప్ సేవలు



**శాసనసభ / హైదరాబాద్ :** పత్తి రైతుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం వాట్సప్ సేవలను ప్రారంభించింది. వాట్సప్ నంబర్ 8897281111 ద్వారా పత్తి అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను అందించేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పత్తి పంట క్రయవిక్రయాల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని ఈ సేవలను ప్రారంభించింది. పత్తి కొనుగోళ్లు, అమ్మకం, అర్హత, తదితర వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్లలో వేచి ఉండే సమయం వంటి వివరాలను రైతులు తమ ఇంటి వద్దనే ఉండి ఈ నంబరు ద్వారా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. రైతులందరూ మార్కెటింగ్ శాఖ తీసుకొచ్చిన ఈ వాట్సప్ యాప్‌ను ఉపయోగించి ఎలాంటి ఇబ్బందులు పడకుండా పత్తిని విక్రయించుకోవాలని రైతులను కోరారు. అలాగే, రైతులకు ఫిర్యాదులున్నా వాట్సప్ ద్వారా సమాచారమిస్తే.. మార్కెటింగ్ శాఖ సత్వరమే చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల తెలిపారు.

## చంచల్ గూడ జైలు నుంచి
## జానీ మాస్టర్ విడుదల



- లైంగిక ఆరోపణల కేసులో జానీ మాస్టర్ అరెస్ట్
- బెయిల్ మంజూరు చేసిన కోర్టు

మిగతా »»2లో

( మొదటి పేజీ తరువాయి )

## యుద్ధ భూమిలో సమస్యలు పరిష్కారం కావు: ప్రధాని మోదీ

వీలైనంత త్వరగా వీటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా కృషి చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంది. యుద్ధాల వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని భారత్ ఎప్పటికీ విశ్వసించదు" అని మోదీ పేర్కొన్నారు. మరోవైపు 20వ శతాబ్దంలో ఏర్పాటైన గ్లోబల్ ఫోరమ్‌లు 21 శతాబ్దపు సవాళ్లను పరిష్కరించడానికి సరిపోవని మోదీ అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలితో సహా పలు అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ ప్రతిపాదనలతో స్కోల్జ్ కూడా ఏకీభవించారు.అంతకుముందు ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్ సదస్సును ప్రారంభించిన మోదీ.. ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తతలు, విభేదాలు ముసురుకున్నప్పటికీ భారత్, జర్మనీల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఇరుదేశాల అభివృద్ధికి బలమైన పునాదిగా మారిందని పేర్కొన్నారు. ఈ రెండు దేశాల మధ్య భాగస్వామ్యం కేవలం లావాదేవీలకే పరిమితం కాలేదని, రెండు బలమైన ప్రజాస్వామ్య దేశాల పరివర్తనకు నిదర్శనంగా నిలిచిందని చెప్పారు. జర్మనీ ప్రకటించిన 'ఫోకస్ ఆన్ ఇండియా'ను ప్రధాని మోదీ స్వాగతించారు. ఇరుదేశాల భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

### విద్యుత్ సంస్థల కోసం చేసే ఖర్చు భారం కాదు.. ప్రభుత్వ బాధ్యత.. కాంగ్రెస్ సర్కార్‌కు కేటీఆర్ సూచన

ఇక్కడ కూడా కరెంట్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రతి మనిషికి విద్యుత్‌తో విడదీయరాని సంబంధం ఉందని తెలిపారు.విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించి ఈఆర్సీ సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు పదేళ్ల పాటు విద్యుత్ సంస్థలకు స్వర్ణయుగంగా మారిందని కేటీఆర్ అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చిన 10 నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని తెలిపారు. దానికి తోడు ఇప్పుడు కరెంట్ ఛార్జీల వాతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాలకులకు విజన్ ఉంటే.. సంపద పెంచి పేదలకు పంచాలి.. కానీ.. ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపి.. సంపద పెంచుకోవాలనే ఆలోచన చేయటం దుర్మార్గమని అన్నారు. డిస్కమ్ లంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలే తప్ప ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదని సూచించారు. విద్యుత్ అంటే వ్యాపారం కాదు.. రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రమని అన్నారు. విద్యుత్ సంస్థల బలోపేతం కోసం చేసే ఖర్చు భారం కాదని.. అది ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. అదనపు ఆదాయం కోసం.. 18 వేల కోట్ల అదనపు భారం మోపాలన్న కాంగ్రెస్ సర్కారు ఆలోచనే ప్రజా వ్యతిరేకమైనదని విమర్శించారు. విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన చార్జీలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని కోరారు. వివిధ కారణాలు చెప్పి 963 కోట్లు అప్ ఛార్జీలను ప్రజలపై భారం వేయాలనుకోవటం సరికాదని హితవు పలికారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా తక్షణం రూ. 12 వందల కోట్లు పెంచుకోవటంతో పాటు డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు.కేసీఆర్ అధికారంలో ఉన్నపుడు పదేళ్ల పాటు రాష్ట్ర ప్రజల మీద ఒక్క రూపాయి భారం వేయలేదని కేటీఆర్ గుర్తుచేశారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్ట్ ఉచితంగా నీళ్లు ఇచ్చినప్పటికీ ఒక్క రూపాయి భారం వేయలేదని అన్నారు. సిరిసిల్లలో నేతన్నలకు 10 హెచ్ పీ మీద 50 శాతం సబ్సిడీ కూడా ఇచ్చామని అన్నారు. ఇప్పుడు 10 హెచ్ పీలను 30 హెచ్ పీ ల వరకు పెంచి 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఇళ్లకు 300 యూనిట్లకు దాటితే ప్రస్తుతం ఉన్న రూ. 10 ఫిక్స్‌డ్ ఛార్జీలను 50 కి పెంచాలని చేసిన ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని అన్నారు.ఒక్క సెస్ పరిధిలోనే తీసుకుంటే లక్షా 20 వేలకు పైగా కనెక్షన్లు ఉంటే 75 వేల కనెక్షన్ల వరకు ఎండకాలంలో 300 యూనిట్లకు పైగా వాడుతున్నారని కేటీఆర్ తెలిపారు. కరెంట్ వినియోగమనేది గతంతో పోల్చితే చాలా వరకు పెరిగిందని పేర్కొన్నారు. ఇప్పుడు డిస్కంలు చేసిన ప్రతిపాదన పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉందని విమర్శించారు. ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. 11కేవీ, 33కేవీ, 220 కేవీ కింద నడిచే పరిశ్రమలకు సంబంధించి అన్నింటిన ఒకే కేటగిరీ లోకి తీసుకురావడం అసంబద్ధమని తెలిపారు. అదానీ ఒక ఫ్యాక్టరీ పెడితే వారికి వర్తించే కేటగిరీనే మా సిరిసిల్లలో సాంచాలు నడిపే పరిశ్రమకు ఉంచాలనుకోవటం హేతుబద్ధమైన నిర్ణయం కాదని అన్నారు. పరిశ్రమలకు సంబంధించి కరెంట్ ను అన్నింటిని ఒకే గాటున కట్టడమంటే సూక్ష్మ చిన్న, మధ్య పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లే అని అన్నారు. ఈ విధమైన కుట్ర చేస్తూ చిన్న పరిశ్రమలకు రాయితీ ఇవ్వకుండా ఉండే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటు పడిందని.. చాలా పరిశ్రమలు తరలిపోతున్నాయని తెలిపారు. ఇంకా ఛార్జీలు పెంచితే పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రమలు బెంబేలెత్తేపోతాయని తెలిపారు. కుటీర, చిన్న, పెద్ద పరిశ్రమలను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిస్కంలు చేసిన ప్రతిపాదనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని అన్నారు.

## మూడు నెలలు అక్కడ ఉంటా... రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నా: కిషన్ రెడ్డి

మూసీ పరీవాహక ప్రాంతంలో మూడు నెలల పాటు ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇందిరాపార్క్ వద్ద మూసీ ప్రాంతాల్లోని పేదల ఇళ్ల కూల్చివేతలను నిరసిస్తూ బీజేపీ అధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ... మూసీ పరీవాహక ప్రాంతంలో ఉంటున్న ప్రజల కోసం తాను అక్కడ ఉండేందుకు సిద్ధమేనన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతోందని, కానీ నిరుపేదలకు ఇచ్చేందుకు ఏ ఇంటికీ శంకుస్థాపన చేయలేదన్నారు. కానీ దశాబ్దాలుగా నివసిస్తున్న వారి ఇళ్లను కూల్చివేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీల పేరుతో తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి, సోనియా, రాహుల్ గాంధీ మభ్యపెట్టారని ఆరోపించారు.బీఆర్ఎస్ హయాంలో కూడా ప్రజల ఇళ్లకు మార్కింగ్ చేసి భయపెట్టారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే దారిలో నడుస్తోందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కానీ ఏళ్లగా అక్కడ ఉంటున్న వారి ఇళ్లను కూల్చివేస్తే ఊరుకునేది లేదన్నారు. రిటైనింగ్ వాల్‌తో సుందరీకరణ చేసుకోవాలని సూచించారు. మూసీ పక్కన ఉండలేకపోతున్నామని బాధితులు ఎవరైనా చెప్పారా? అని కిషన్ రెడ్డి నిలదీశారు.

# మూసీ బాధితులకు అండగా బిజెపి మహాధర్నా.. సీఎంరేవంత్ రెడ్డి సవాల్ ను స్వీకరిస్తున్నాం

## పాల్గొన్న కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి,బండి, ఎంపీలు, ఎమ్మెల్యేలు












**సికింద్రాబాద్/కంటోన్మెంట్ / శాసనసభ ప్రతినిధి అక్టోబర్ 25:** మూసీ బాధితులు,పేదలు, మధ్యతరగతి ప్రజల పక్షాన బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన మూసీ సుందరీకరణ,పునరుజ్జీవం పేరుతో మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదల ఇండ్లను కూల్చుతూ చేస్తున్న విధ్వంసకాండను వ్యతిరేకిస్తూ, ఇందిరా పార్క్,ధర్నా చౌక్ వద్ద నిరసనలో పాల్గొన్న బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ ముఖ్య నాయకులు, పెద్దఎత్తున తరలివచ్చిన మూసీ బాధితులు, ప్రజలు, ప్రజాసంఘాలు ఈ మహాధర్నాలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ..మూసీ బాధితులకు అండగా,కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతలకు నిరసనగా బీజేపీ చేపట్టిన మహాధర్నాలో కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తి కావస్తుందన్నారు. గత రెండు నెలలుగా ఆ నిరుపేదలందరికీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వీరందరికీ బీజేపీ అండగా నిలవాలని నిర్ణయించింద న్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక బిఆర్ఎస్ బాటలోనే నడుస్తుందన్నారు.స్థానిక ఎంపీలు,పార్టీ నాయకులు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నారని అన్నారు. కానీ పేద ప్రజల ఇళ్ల జోలికి వస్తే బిజేపీ అడ్డుకుంటుం దన్నారు.మూసీకి రెండు వైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టి సుందరీకరణ చేపట్టాలన్నారు.దేశంలో,రాష్ట్రంలో, నగరంలో పేదవా డికి ఇబ్బంది వస్తే,మోదీ ఆదేశాలతో అండగా నిలబడతామని మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.హైదరాబాద్ ప్రజలు బీజేపీని నమ్ముతున్నారు. వాజీపేయి నగర్, దీనదయాళ్ నగర్ లాంటి అనేక నగర్ లను బీజేపీ అభివృద్ధి చేసింది. బీజేపీనే చేస్తుంది అనే నమ్మకం వారికి ఉంది. ఎఫ్టీఎల్ బఫర్ పేరుతో బాగా డిమాండ్ ఉన్న ఏరియాలో ఎక్కువ వెడల్పు మార్కింగ్ చేస్తున్నారు. చెరువుల్లోకి మురుగు నీరు రాకుండా చేయాలని అన్ని ప్రాంతాల వారు కోరుతున్నారు.మూసీ, హైడ్రా బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది అని ఈ వేదిక మీద నుండి భరోసా కల్పిద్దాం అని ఈటల రాజేందర్ అన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.మూసీ నది ఒకప్పుడు హైదరాబాద్ కు మంచినీటిని అందించిన నది.నేను పాదయాత్ర చేసినప్పుడు కళ్లారా చూశా.కాంగ్రెస్ పార్టీకి పేదల ఇండ్లు ముఖ్యం కాదు.సోనియాగాంధీ అల్లుడికి సంబంధించిన కాంట్రాక్టుల కోసం మాత్రమే.మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఎక్కడికి నుంచి వస్తున్నయో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలి. లక్షన్నర కోట్లతో ముందు ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలి. అక్రమంగా కూల్చుతున్న ప్రభుత్వమే దోషి.మాకు కేసులు, లాఠీలు కొత్త కాదు. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో రేవంత్.. మేము కొట్లాడేందుకు సిద్ధం.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రులు రోడ్లపై తిరగకుండా చేస్తాం అన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చ రించారు..ఈ ధర్నా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి,ఎంపీ బండి సంజయ్,మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఆదిలాబాద్ ఎంపీ గూడెం నగేష్,ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్,ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాజేశ్వర్ రెడ్డి,కామారెడ్డి ఎమ్మెల్యే కోటిపల్లి వెంకటరమణారెడ్డి,నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ, ఆసిఫాబాద్ఎమ్మెల్యే హరీష్,మాజీ ఎమ్మెల్యేలు,మోండా,రామ్ గోపాల్ పేట డివిజన్ కార్పొరేటర్స్ కొంతం దీపికా నరేష్,చీర సుచిత్ర శ్రీ కాంత్,బానుక నర్మదా మల్లికార్జున్,మేకల సారంగపాణి, మూసీ బాధితులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

### మా బాధలను అర్థం చేసుకోండి.. సచివాలయాన్ని ముట్టడించిన బెటాలియన్ పోలీస్ కుటుంబాలు

కాగా, వారిని అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. 'ఏక్ పోలీస్' హామీ ఏమైంది..అందరి పోలీసుల్లాగే తమ భర్తలు కూడా పరీక్షలు రాసి, ఫిజికల్ టెస్టుల్లో పాసై, 9 నెలలు కఠోర శిక్షణ తీసుకున్నవారేగా? వాళ్లకెందుకు మిగతా సివిల్, ఏఆర్ పోలీసుల్లాగా ఒకే చోట డ్యూటీలు వేయరు? వాళ్లను కట్టుకున్న పాపానికి మేమేం తప్పు చేశాం? అంటూ బాధిత బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. 'మా భర్తలు ఏడాదికి మూడు జిల్లాలు తిరగాల్సి వస్తుంది. మేము ఎక్కడ ఉండాలి? మా బిడ్డలు ఎక్కడ చదువుకోవాలి? చేసేది పోలీసు ఉద్యోగమైనా ఈ తిరుగుడేంది?' అని ప్రశ్నిస్తున్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్న తమ భర్తలను తోటి పోలీసులే జీతగాండ్లలాగా చూస్తున్నారని.. పొద్దున్నే పలుగు, పారలతో గడ్డి పీకిస్తున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు. రాష్ట్రంలో సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగానే బెటాలియన్ పోలీసులకు వారు కోరుకున్న జిల్లాలో కనీసం 3-5 ఏండ్లు ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల పిల్లల చదువులకు అంతరాయం లేకుండా ఉంటుందని, ఉద్యోగభారం తగ్గుతుందని చెబుతున్నారు.గతంలో ఎలా ఉందంటే..?గతంలో టీజీఎస్పీ బెటాలియన్లలో పనిచేసే సిబ్బందికి 15 రోజులు డ్యూటీ ఉంటే ఎక్కడో మారుమూల స్టేషన్ నుంచి ఇంటి ప్రయాణానికి ఒకరోజు కేటాయించినా 3 రోజులు కుటుంబంతో



గడిపే అవకాశం ఉండేది. ప్రస్తుతం 26 రోజులు డ్యూటీ చేసిన తర్వాత నాలుగు రోజులు సెలవు తీసుకోవాలని నిబంధనను కొత్తగా వచ్చిన ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్ తీసుకురావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటామని పోలీసులు చెబుతున్నారు. రాష్ట్రంలో 13 బెటాలియన్స్ ఉన్నాయి. ఒక్కో బెటాలియన్‌లో 1500 మంది చొ ప్పున సిబ్బంది ఉంటారు. జిల్లా హెడ్‌క్వార్టర్‌లో కచ్చితంగా 200 మంది పహారా ఉంటారు. మిగిలిన వారిని ఏ బీ సీ డీ ఈ ఎఫ్ జీ కంపెనీలుగా విభజిస్తారు. ఆయా బెటాలియన్ పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్‌లో కనీసం 3 నెలలు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. బెటాలియన్ పరిధిలోని అన్ని పీఎస్‌లకు రొటేట్ అవుతుండాలి. దీనిని మార్చేందుకు కేసీఆర్.. 'ఏక్ పోలీస్'ను ప్రవేశపెడదామనుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 26రోజుల డ్యూటీ విధానాన్ని తీసుకొచ్చింది.

### అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి!: బీజేపీ పనేనంటూ ఆప్ ఆరోపణ

తమ నేతపై దాడి ఘటనను సీరియస్‌గా తీసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈడీ, సీబీఐ, జైలుతో అరవింద్ కేజ్రీవాల్ ను అణిచివేయాలని ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో బీజేపీకి చెందినవారు అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి యత్నించారని ఆరోపించారు. కేజ్రీవాల్‌కి ఏదైనా జరిగితే బీజేపీనే బాధ్యత వహించాలని ఢిల్లీ మంత్రి సౌరభ్ భద్వాజ్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.బీజేపీకి అరవింద్ కేజ్రీవాల్ శత్రువుగా మారారు. మొదట ఈడీ, సీబీఐని ఉపయోగించి తప్పుడు కేసులు పెట్టి, జైల్లో పెట్టారు. ఇన్సులిన్ ఆపేసి చంపాలని ప్రయత్నించారు. అది ఫలించకపోవడంతో ఇప్పుడు బీజేపీ గూండాలు అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి చేశారు. కేజ్రీవాల్ ను బీజేపీ చంపేయాలని చూస్తోంది. అరవింద్ కేజ్రీవాల్ కు ఏం జరిగినా బీజేపీదే బాధ్యత అని మరో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు.మరోవైపు, ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత అతిషి బీజేపీని ఘాటుగా హెచ్చరించారు. 'అరవింద్ కేజ్రీవాల్‌కు ఏదైనా జరిగితే ఢిల్లీ ప్రజలు ఎప్పటికీ క్షమించరని నేను బీజేపీకి చెప్పాలనుకుంటున్నాను' అని అతిషి తన ప్రసంగంలో బీజేపీకి తీవ్ర హెచ్చరిక చేశారు. ఇలాంటి హెచ్చరిక ఢిల్లీలోని ఉద్రిక్త రాజకీయ వాతావరణాన్ని, తమ నాయకుడిని లక్ష్యంగా చేసుకున్న దాడికి వ్యతిరేకంగా నిలబడాలనే ఆప్ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. 30 ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు ఇన్సులిన్‌ను అందించడానికి బీజేపీ నిరాకరించడంతో పాటు ఆయన ఎదుర్కొంటున్న ఇబ్బందులను అతిషి వెల్లడించారు. %ూూ్రా% కార్యకర్తల భారీ నిరసనలు, ఢిల్లీ హైకోర్టు జోక్యం తర్వాత మాత్రమే కేజ్రీవాల్‌కు అవసరమైన వైద్య చికిత్స అందించారన్నారు. ఈ చర్యలు బీజేపీచే ప్రమాదకర స్థాయిని పెంచడంలో భాగమని ఆప్ ఆందోళనను అతిషి ఉదహరించారు. తాజాగా, కేజ్రీవాల్‌పై బీజేపీ హత్యాయత్నానికి పాల్పడిందని తీవ్ర ఆరోపణలు చేశారు.మరోవైపు, ఆమ్ ఆద్మీ పార్టీ నేతల ఆరోపణలను బీజేపీ నేతలు తిప్పికొడుతున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు అరవింద్ కేజ్రీవాల్ మరో నాటకానికి తెరతీశారని ఆరోపించారు. 2014, 2019 ఎన్నికల ముందు కూడా ఇలాంటి దాడులే జరిగాయన్నారు. ఇప్పుడు ఢిల్లీకి అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న క్రమంలో మరోసారి ఇలాంటి దాడి ఘటన చోటు చేసుకోవడం కేజ్రీవాల్ కొత్త నాటకానికి నిదర్శనమని మండిపడుతున్నారు. కాగా, కేజ్రీవాల్‌పై దాడికి యత్నించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిచేలా పనిచేయాలి: సీఎం చంద్రబాబు

ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నేడు నాలుగు జిల్లాల టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో... ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి... కృష్ణా జిల్లా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని టీడీపీ నేతలకు సూచించారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు నవంబరు 6వ తేదీ లోపు పూర్తిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కష్టపడి పనిచేస్తున్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులు గెలిచేలా చూడాలని పేర్కొన్నారు. జనసేన, బీజేపీ శ్రేణులను కూడా కలుపుకుని సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్దేశించారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెట్టాలని, 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయే గెలుపే లక్ష్యంగా ఇప్పటినుంచే కృషి చేయాలని చంద్రబాబు సూచించారు. మండలాల వారీగా ఎన్డీయే సమన్వయ కమిటీలు పెట్టాలని అన్నారు. ప్రతి చోట మూడు పార్టీల నేతలతో సమన్వయ భేటీలు నిర్వహించాలని తెలిపారు.

### జైలు నుంచి వెళుతుండగా మాట్లాడేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులు

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై అత్యాచార ఆరోపణలతో పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న జానీ మాస్టర్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. అతని బెయిల్ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ రోజు అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో ఈరోజు సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు.జైలు లోపలి నుంచి ఆయన కారులో బయటకు వచ్చారు. ఈ సమయంలో ఆయనను మీడియా పలకరించే ప్రయత్నం చేసింది. "సర్, ఏమైనా మాట్లాడుతారా?", "మాస్టర్ గారూ, దిగి మాట్లాడండి?" అని మీడియా ప్రతినిధులు అడిగారు. అయితే ఆయన కారులో నుంచే అందరికీ నమస్కారం పెట్టుకుంటూ వెళ్లిపోయారు.

## తెలంగాణ స్పోర్ట్స్ పాలసీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

ఈ రంగంలో నిపుణులు, క్రీడాకారులతో సంప్రదింపులు జరపాలని సీఎం రేవంత్ చెప్పారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను వెంటనే తయారు చేయాలన్నారు సీఎం రేవంత్.వచ్చే రెండేళ్లలో నేషనల్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌ను సంప్రదించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మరోవైపు, ABP Network మీడియా సంస్థ హైదరాబాద్ లో నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్' సదస్సు (The Southern Rising Summit 2024)లో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రగతిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర, రైజింగ్ తెలంగాణ (Rising Telangana), రైజింగ్ హైదరాబాద్ (Rising Hyderabad) లక్ష్యాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.పన్నుల వాటాల్లో దక్షిణాది రాష్ట్రాలకు హక్కుగా రావలసిన నిధుల విషయంలో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశం ప్రగతిబాటలో పయనించడానికి అన్ని రాష్ట్రాలు సమంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టం చేశారు.

# మస్కా బన్ తిని.ఛాయ్ తాగి.



**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు సాయంత్రం అనుకోకుండా హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని నీలోఫర్ కేఫ్ కు విచ్చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బీజేపీ ఆధ్వర్యంలో మూసీ బాధితుల పక్షాన ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేసిన అనంతరం ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు లంకల దీపక్ రెడ్డి, డాక్టర్ పుల్లారావు యాదవ్ లతో కలిసి నీలోఫర్ కేఫ్ కు వచ్చారు.సాదాసీదాగా కేఫ్ లోకి వెళ్లి కూర్చుని 'మస్కా బన్ ' ఆరగించడంతోపాటు ఛాయ్ తాగారు. బండి సంజయ్ వచ్చారని తెలుసుకున్న నీలోఫర్ కేఫ్ యజమాని బాబూరావు అక్కడికి వచ్చి పరిచయం చేసుకున్నారునీలోఫర్ చాయ్, మస్కా బన్ తనకు ఇష్టమని కేంద్ర మంత్రి చెప్పడంతో. తాము ఈ మధ్య చిట్టిముత్యాలతో తయారు చేసిన సాంబార్ రైస్ ను కస్టమర్లకు అందిస్తున్నామని చెప్పిన బాబూరావు వెంటనే సాంబార్ రైస్ తెప్పించి తినాలని సంజయ్ ను కోరారు. సాంబార్ రైస్ చాలా బాగుందని పేర్కొన్న బండి సంజయ్ ఈ కేప్ కు నీలోఫర్ అని పెట్టడానికి కారణమేంటని అడిగి తెలుసుకున్నారు. "నేను చాలా పేదరికం నుండి వచ్చిన. 1976లో నీలోఫర్ ఆసుపత్రి వద్ద 2 రూపాయలకు చిన్న ఉద్యోగం చేసి%హ% అక్కడే టీ, బిస్కట్లు అమ్మిన. వాటికి గిరాకీ ఉండటంతో కేఫ్ స్థాపించాను. ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే నీలోఫర్ పుణ్యమే. అందుకే తన వ్యాపారానికి ఆ పేరే పెట్టిన. నీలోఫర్ ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి కుటుంబాలకు ఉచిత భోజనం పెట్టి రుణం తీర్చుకుంటున్నా"అని వివరించారు. ఈ సందర్భంగా బాబూరావు చేస్తున్న సేవలను బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు.

# కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం



**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** ఇటీవల ఆదిలాబాద్‌లో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో కేటీఆర్ దిష్టిబొమ్మలను కార్యకర్తలు దహనం చేశారు. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కులేదని కాంగ్రెస్ ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

# విశ్రాంత ఈఎన్సీ వెంకటేశ్వర్లుపై కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం



**శాసనసభ / హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల్లో 2019 నుంచే సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. వాటిపై నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, ఈఎన్సీ జనరల్ సమావేశాలు సైతం నిర్వహించారని విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు.వరుసగా రెండో రోజు ఆయన కాళేశ్వరం కమిషన్ ముందు హాజరయ్యారు. మూడు ఆనకట్టలకు సంబంధించిన పలు అంశాలపై వెంకటేశ్వర్లును కమిషన్ ప్రశ్నించింది. మొదట నిర్మించిన కాఫర్ డ్యాం వరదలో మునిగిపోవడంతో ఎత్తు పెంచాల్సి వచ్చిందన్న వెంకటేశ్వర్లు... డిజైన్ల తయారీలో ఆలస్యం జరిగిందని చెప్పారు. డిజైన్ల ఖరారులో ఆలస్యం, మార్పుల కారణంగా అంచనా వ్యయం పెరిగిందని కమిషన్‌కు వివరించారు. డిజైన్‌లో మార్పులతో అంచనా వ్యయం అంత భారీగా పెరుగుతుందా? అని కమిషన్ ప్రశ్నించింది. ఈ దశలో వెంకటేశ్వర్లుపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.కాళేశ్వరానికి ముందు ప్రాణహిత – చేవెళ్ల కోసం రూ.14వేల కోట్లకు పైగా విలువైన పనులు చేశారని.. అందులో రూ.750 కోట్ల విలువైన పనులు ఫలితం లేకుండా పోయాయని వెంకటేశ్వర్లు తెలిపారు. సవరించిన అంచనా వ్యయాన్ని అప్పటి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆమోదించారని చెప్పారు. మేడిగడ్డ విషయంలో సబ్ స్టాన్షియల్ సర్టిఫికెట్, మిగతా రెండు బ్యారేజీలకు పూర్తి సర్టిఫికెట్ ఇచ్చామన్న వెంకటేశ్వర్లు.. స్థానిక అంశాలు, భూసేకరణ వల్లే బ్యారేజీల పనుల్లో ఆలస్యం అయినట్లు వివరించారు. పనులు ఆలస్యం అవుతున్నప్పుడు మౌఖిక ఆదేశాలు ఇచ్చామన్నారు. అత్యవసరం కాబట్టే డ్రాయింగ్స్ ఆలస్యమైనా పనులు చేయాలని చెప్పామని పేర్కొన్నారు.అఫిడవిట్‌లో ఇచ్చిన సమాచారానికి, చెబుతున్న సమాధానాలకు పొంతన లేదని కమిషన్ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎవరో చెబితే వారిని సంతృప్తి పరిచేందుకు పనులు చేశారని.. వేరే వాళ్లు చేసిన తప్పులు మీద వేసుకునే ప్రయత్నం చేయొద్దని కమిషన్ సూచించినట్లు తెలిసింది. సాధారణం అంటూ సమాధానాలు చెప్పొద్దని.. మూడు బ్యారేజీలకు సంబంధించి స్పష్టంగా సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు, వాటికి ఆధారాలను సోమవారం సమర్పిస్తానని వెంకటేశ్వర్లు చెప్పడంతో.. అందుకు కమిషన్ అనుమతి ఇచ్చింది. మళ్లీ సోమవారం విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

## ఇకనుండి డేట్ అఫ్ బర్త్ ప్రూఫ్

# ఆధార్ కార్డు కాదు: సుప్రీంకోర్టు



**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** ఒక వ్యక్తి వయస్సు నిర్ధార ణకు స్కూల్ సర్టిఫికెట్ ను ప్రామాణికంగా తీసుకోవా లని, సుప్రీంకోర్టు స్పష్టం చేసింది, ఆధార్ కార్డు ఆధారంగా నిర్ణయానికి రాకూడదని పేర్కొంది, పదవతరగతి ధ్రువీకరణ పత్రాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకో వాలని..ఆధార్ కార్డు ఆధారంగా నిర్ణయానికి రాకూడదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది...రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తికి పరిహారం చెల్లించేందుకు ఆధార్ కార్డును ఆమోదిం చిన పంజాబ్– హర్యానా హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది.జువైనల్ జస్టిస్ పిల్లల సంరక్షణ – రక్షణ చట్టం, 2015లోని సెక్షన్ 94 ప్రకారం స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్‌లో పేర్కొన్న పుట్టిన తేదీ నుండి మరణించినవారి వయ స్సును నిర్ణయించాలని న్యాయమూర్తులు సంజయ్ కరోల్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. విశిష్ట గుర్తింపు అథారిటీ ఆఫ్ ఇండియా, దాని సర్క్యులర్ నం. 8/2023 ప్రకారం, డిసెంబర్ 20, 2018 నాటి ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంకు సంబంధించి ఒక ఆధార్‌ను పేర్కొన్నట్లు మేము గుర్తించాం .ఆధార్ కార్డ్ ను వయస్సు నిర్ధారణ పత్రంగా భావించరాదని పేర్కొన్న విషయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. హక్కుదారు–అప్పీలెంట్ల వాదనను అంగీకరించింది ధర్మాసనం. అతని స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్ ఆధారంగా మరణించిన వ్యక్తి వయస్సును లెక్కిం చిన మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (MACT) నిర్ణయాన్ని సమర్థించింది. మృతుడి ఆధార్ కార్డుపై ఆధారపడి హైకోర్టు అతని వయస్సు 47 సంవత్సరా లుగా అంచనా వేసింది. పాఠశాల లీవింగ్ సర్టిఫికేట్ ప్రకారం అతని వయస్సును లెక్కించినట్లయితే, మరణించే సమయానికి అతని వయస్సు 45 సంవత్సరాలు కాబట్టి ఆధార్ కార్డు ఆధారంగా మరణించిన వ్యక్తి వయ స్సును నిర్ణయించడంలో హైకోర్టు పొరపాటు చేసిందని, ఈ సందర్భంగా గుర్తు చేసింది...

# కేసీఆర్ తెలంగాణను అల్లకల్లోలం చేసి పోయిండు




**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** కేసీఆర్ తెలంగాణను అల్లకల్లోలం చేసి పోయిండు.. ఏడు లక్షల కోట్లు అప్పుచేసి పోయిండని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఇవాళ వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ..నెలకు రూ.7 వేల కోట్లు మిత్తి కడుతున్నామని, కేసీఆర్ ప్రభుత్వంలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండే అని ఆయన వ్యాఖ్యానించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల నెల ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని, చేసిన పాపాలన్నీ మర్చిపోయారు హరీష్ రావు, కేటీఆర్ అని ఆయన ఆరోపించారు. కేటీఆర్ గజినీలాగా అయిపోయాడని, కేటీఆర్ పొద్దున లేస్తే అబద్దాలు తప్ప నిజాలు చెప్పే పరిస్థితి లేదన్నారు. ఇంతకుముందు ఉన్న ముఖ్యమంత్రి తనకోసం తన కుటుంబం కోసం చేసుకున్నాడని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోగ్యంగా ఉండాలన్నారు.వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కు రాజకీయ అనుభవం లేదని, మేనిఫెస్టోలో పెట్టిన అన్ని కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు స్పీకర్ ప్రసాద్ కుమార్. డిసెంబర్ 9 న సోనియా గాంధీ పుట్టిన రోజు అని, వికారాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయన్నారు. చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆయన తెలిపారు. గ్రామాలలో బండల ఇండ్లు లేకుండా చూస్తామని, ఐదు సంవత్సరాల లోపల అన్ని వాగ్దానాలను పూర్తి చేస్తామన్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని, నేను స్పీకర్ ను కాదు మీ అన్న లాంటి వాడిని ఆయన అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ పొద్దున నుండి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తున్నాడన్నారు.

# నేటి నుంచి పత్తి కొనుగోళ్లు.. క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర ఎంతంటే..



**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** ఆదిలాబాద్ జిల్లా మార్కెట్ యార్డ్ లో నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ లో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే, ఎంపీ పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు.సుమారు 11 కాంటాలను ఏర్పాటు చేశారు. సీసీఐతో పాటు ప్రైవేట్ వ్యాపారులు రంగంలో ఉండనున్నారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే పరిష్కరించేందుకు మల్టీ కంట్రోల్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ కు రూ.7521 ప్రకటించింది. అయితే.. తేమ శాతం 8 ఉంటే క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర లభిస్తుందని స్పష్టం చేసింది. 9 శాతం రూ.7,445, 10 శాతం రూ.7,370, 11 శాతం రూ.7,295, 12 శాతం ఉంటే రూ.7,220 మద్దతు ధర లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు వరంగల్ ఏనామమాముల మార్కెట్ లో రైతుల ఆందోళన చేపట్టారు. పత్తి రేటు తగ్గడంపై నిరసన తెలిపారు. కాంటాలను రైతులు నిలిపివేశారు. మార్కెట్లో రైతు సంఘం నేతలు నిరసన దిగారు. అయితే దీనిపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. గుజరాత్ తరహాలో రూ. 8800 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి ధర తక్కువగా ఉండడంతో కనీసం పెట్టుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చలికాలం వచ్చిందంటే పత్తిలో కనీసం 15 శాతం తేమ ఉంటుంది. అయితే మద్దతు ధర కంటే తక్కువ ధర ఉండడంతో సీసీఐ రంగంలోకి దిగనుంది. ఈ ఏడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతింది. పూత, కాతు దశలో వర్షం కురిసింది. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. సాధారణంగా ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 7 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే లభించే అవకాశం ఉంది. జిల్లాలో ఈ ఏడాది 4 లక్షల 33 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దాదాపు 32 లక్షల 47 వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది జిల్లాలో 20 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మొత్తం 11 లక్షల 58 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఇందులో సీసీఐ ద్వారా 7 లక్షల 58 వేల క్వింటాళ్లు, ప్రైవేటు వ్యాపారులు 3 లక్షల 46 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. గతేడాది పత్తి మద్దతు ధర రూ.7,020 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు తొలిరోజు అత్యధికంగా రూ.7,100 కొనుగోలు చేశారు. ఆ తర్వాత ధర తగ్గింది. రైతుకు రూ.6,800 నుంచి రూ.6,500 వరకు ధర లభించింది.

# మాలలతో రేవంత్ కుమ్మక్కు: మందకృష్ణ



**శాసనసభ / ఖమ్మంటౌన్, అక్టోబరు 25:** మాలలతో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కై ఎస్సీ వర్గీకరణ అమలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు.దీని వల్ల మాదిగలకు ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన మాదిగల ధర్మ యుద్ధ సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని ప్రకటించిన రేవంత్‌రెడ్డి, మాలలతో కుమ్మక్కై అమలుకు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.మాలలకు వ్యతిరేకంగా పని చేస్తే పదవి కోల్పోవలసి వస్తుందని ఆయన భయపడుతున్నారని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాల సామాజిక వర్గానికి చెందినవారు కావటమే దీనికి కారణమని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ వర్గీకరణను అమలు చేయకపోవటంతో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఈ నెల 30 వరకు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ధర్మయుద్ధం సభలు నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే నెల 16న రథయాత్ర, డిసెంబరు 21న చలో హైదరాబాద్ ఉంటుందని తెలిపారు.

# కస్తూర్బా గురుకులంలో 11 మంది విద్యార్థినిలకు అస్వస్థత..



**శాసనసభ / హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ కస్తూర్బా గురుకులంలో విద్యార్థినిలు అస్వస్థత గురయ్యారు. శ్వాసకోస సమస్యలతో విద్యార్థులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు.గురుకుల సిబ్బంది విద్యార్థినులను జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్వాస తీసుకోవడంలో 11 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. గురుకులంలో ఏం జరిగిందనే కోణంలో గురుకుల సిబ్బంది ఆరా తీస్తున్నారు. విద్యార్థులను పరిశీలించిన వైద్యులు సరైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. శ్వాస తీసుకోలేని పరిస్థితుల్లో వున్నారని తెలిపారు. తీవ్ర అస్వస్థలకు గురి కావడానికి కారణాలను తెలుసుకోనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు అస్వస్థకు గురైనట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆసుపత్రి వద్దకు చేరుకున్న పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు అస్వస్థలకు గల కారణం పూర్తి యాజమాన్యమే అంటూ ఆందోళన చేపట్టారు. ఉదయం జరిగితే ఇప్పుడు సమాచారం ఇచ్చారని మండిపడ్డారు. గురుకుల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లలు శ్వాస కూడా తీసుకోలేక పోతున్నారని కన్నీరుపెట్టుకున్నారు. దీంతో పిల్లల తల్లిదండ్రుల ఆందోళనతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది.

# ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన చూసి చాలా బాధ అనిపించింది: జగ్గారెడ్డి




**శాసనసభ / హైదరాబాద్ :** ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదనతో కాంగ్రెస్ అగ్రనేతలకు లేఖలు రాయడం, మీడియాలో ఆవేదన వ్యక్తం చేయడంపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు.జీవన్‌రెడ్డి ఒంటరి కాదు.. సమయం వచ్చినప్పుడు జగ్గారెడ్డి అండగా ఉంటారని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి రాజకీయ జీవితం అంతా కాంగ్రెస్‌లోనే కొనసాగిందని, ఆయనకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్న జీవన్‌రెడ్డి ఆవేదన మీడియాలో చూసిన తర్వాత చాలా బాధ అనిపించిందిన్నారు. ఏం జరుగుతుందో తనకు అర్థం కావడం లేదని, ఏం మాట్లాడాలో తెలియడం లేదని.. అందుకే ఏమీ మాట్లాడలేకపోతున్నానని పేర్కొన్నారు.ఈ వయసులో కూడా ఆయనకు ఈ ఆవేదన ఏంటి అని మనసుకు బాధ కలిగిందన్నారు. జీవన్ రెడ్డికి...ఈ మాత్రమైనా జగ్గారెడ్డి అండగా ఉన్నాడని చెప్పడానికే తన మనసులో మాటని మీడియా ద్వారా తెలియజేస్తున్నట్లు చెప్పారు. తాను ఎవరినీ తప్పుపట్టడం లేదని.. జీవన్‌రెడ్డి ఒంటరి అని అనుకోవద్దని పేర్కొన్నారు. ఎప్పుడూ జనంలో ఉండే జీవన్ రెడ్డిని జగిత్యాల ప్రజలు, సంగారెడ్డిలో తనను ఎందుకు ఓడించారో అర్థం కావడం లేదన్నారు. జీవన్‌రెడ్డి సమస్యను అధిష్టానం గుర్తించి పరిష్కారం చూపాలని... సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలను కోరుతున్నట్లు తెలిపారు.

# ఇంకెంతకాలం మాలలను అణచివేస్తారు?



**భద్రాచలం, అక్టోబరు 25 శాసనసభ :** దళితులకు రాజ్యాంగ అధికారం దక్కకూడదనే కుట్రతోనే ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు.ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగలేదని, న్యాయస్థానాలు.. మనువాదుల జేబు సంస్థలుగా మారాయని ఆయన విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శుక్రవారం మాలల మహా పాదయాత్ర ప్రారంభమైంది. భద్రాద్రి నుంచి హైదరాబాద్ వరకు చేపడుతున్న ఈ యాత్రను జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ, న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్రంలో అమలు సాధ్యమా, కాదా అనే విషయాన్ని పరిశీలించకుండా.. వర్గీకరణ వెంటనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్రంలో మాదిగలు, మాలలు జనాభాపరంగా సమానంగా ఉన్నారని, అయినా మాలలను తక్కువ చేసి చూపుతున్నారని వాపోయారు. ఏ రీతిన వర్గీకరణ చేపడుతుందో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మందకృష్ణ మాదిగ మనువాదుల ఏజెంట్‌గా మారారని ఆరోపించారు. మోదీ, రేవంత్‌ను తరిమికొట్టేందుకు మాలలు సిద్ధంగా ఉండాలని పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. 38 రోజుల పాటు కొనసాగే మాలల మహాపాదయాత్ర డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించబోయే మాలల మహాసంగ్రామ సభతో ముగియనుంది.

శాసనసభ

శనివారం 26 అక్టోబర్ - 2024

# టీవీలోకి డబుల్ ఇస్మార్ట్.. ఎప్పుడు? ఎక్కడ చూడాలంటే?



జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్ ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోంది.పూరీ జగన్నాథ్ డైరెక్షన్,రామ్ నటవిశ్వరూపంతో అదరగొట్టిన డబుల్ ఇస్మార్ట్, ఈ ఆదివారం(అక్టోబర్ 27న)సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానుంది. డైరెక్టర్ పూరీ జగన్నాథ్ లైగర్ లాంటి డిజాస్టర్ తర్వాత డబుల్ ఇస్మార్ట్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు.రామ్ హీరోగా తెరకెక్కిన ఇస్మార్ట్ శంకర్ సినిమా సూపర్ హిట్ కావడంతో దానికి సీక్వెల్ గా తెరకెక్కిన డబుల్ ఇస్మార్ట్ సినిమా మీద కూడా అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది కానీ ఏమాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. ఒక రకంగా పూరి జగన్నాథ్ కి ఇది మరొక సెట్ బ్యాక్ అని చెప్పాలి. రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, గెటప్ శ్రీను, అలీ, షాయాజీ షిండే,ఝాన్సీ వంటి నటులు కీలక పాత్రలు పోషించారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్ తో రూపొందిన ఈ మాస్ ఎంటర్టైనర్ టీవీలో చూసేందుకు రెడీ అవండి.

# హమ్మయ్య.. ఒక టెన్షన్ క్లియర్!



అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఇప్పటికీ హిందీలో పలు సినిమాలు చేసింది. అందులో ఏ ఒక్క సినిమా ఆమెకు స్టార్ హోదా తీసుకురాలేకపోయాయి. కాబట్టి తెలుగులో లక్ పరిశీలించుకోవాలని ప్రయత్నాలు చేసి ఈ మేరకు ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమాలో ఒక లక్కీ ఛాన్స్ కొట్టేసింది.అయితే దేవర మొదటి భాగంలో ఎక్కువసేపు శ్రీదేవి కూతురు కనిపించలేదని కంప్లైంట్స్ ఉన్నాయి. కనిపించింది కొంచెం సేపు అయినా ఆమె హీరోయిన్ లాగా అనిపించలేదని రకరకాల కామెంట్స్ వచ్చాయి. అయితే ఇప్పుడు ఆమె అభిమానులు స్థిమితపడేలా ఒక ఆసక్తికరమైన వార్త తెరమీదకు వచ్చింది. అదేంటంటే ఆమె రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న రాంచరణ్ 16వ సినిమాలో కూడా నటిస్తోంది.అయితే సెకండ్ హీరోయిన్గా మరొక బాలీవుడ్ హీరోయిన్ ని దింపే ప్రణాళికలు ఉన్నాయని ఆ మధ్య ప్రచారం జరిగింది. అయితే తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఈ సినిమాలో కేవలం ఒకే హీరోయిన్ మాత్రమే ఉంటుందని అది కూడా జాన్వీ కపూర్ మాత్రమేనని తెలుస్తోంది. ఈ సినిమాలో మరే ఇతర హీరోయిన్లు ఉండబోరు అని తెలుస్తోంది. ఒకరకంగా ఇది జాన్వీ కపూర్ కు మాత్రమే కాదు ఆమె అభిమానులకు కూడా కాస్త స్థిమితపరిచే వార్త అని చెప్పొచ్చు.




# ఆ హీరోతో సినిమా తరువాతే 'పుష్ప-3' చిత్రానికి శ్రీకారం!




అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన పుష్ప ది రైజ్ విజయం సాధించడమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులను అలరించింది. ముఖ్యంగా ఆ చిత్రంలో పుష్పరాజ్ మేనరిజంతో కూడిన "తగ్గేదెలే" అనే డైలాగ్ ఎంత పాపులారిటీని దక్కించుకుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు పుష్పకు సీక్వెల్‌గా సేమ్ కలయికలో పుష్ప-2 ది రూల్ తెరకెక్కుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరిదశలో వున్న ఈ చిత్రం మరో వైపు నిర్మాణానంతర పనులను కూడా శరవేగంగా జరుపుకుంటోంది. డిసెంబరు 5న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. కాగా ఇటీవల ఈ పుష్ప-2 చిత్ర నిర్మాతలు హైదరాబాద్‌లో ఓ పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పుష్ప-2కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను మీడియాతో పంచుకున్నారు. పుష్ప-3 కూడా కచ్చితంగా ఉంటుందని నిర్మాతలు ఇదే వేదికపై పేర్కొన్నారు. దీనికి సంబంధించిన లీడ్ పుష్ప-2 ఎండింగ్‌లో ఉంటుందని చెప్పి సినిమాపై మరింత ఆసక్తిని పెంచారు. అయితే పుష్ప-3 సెట్స్‌మీదకు వెళ్లే కంటే ముందు అల్లు అర్జున్... త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తారు. దర్శకుడు సుకుమార్ కూడా రామ్‌చరణ్‌తో ఓ సినిమాను చేయాల్సి ఉంది. రంగస్థలం తరువాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రాబోతుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా గతంలో వెలువడింది. సో.. అల్లు అర్జున్, సుకుమార్ ఇద్దరూ కూడా చెరో సినిమా పూర్తిచేసిన తరువాతే పుష్ప-3 సెట్స్ మీదకు వెళుతుంది.

# కొడుకు విడాకుల వార్తలు..10 ఫ్లాట్లు కొన్న బచ్చన్!



గత కొద్దిరోజులుగా అభిషేక్ బచ్చన్ ఐశ్వర్యారాయ్ విడాకులు తీసుకుంటున్నారు అనే వార్తలు తెరమీదకు వస్తున్నాయి. అయితే వారి నుంచి ఎలాంటి ప్రకటన ఇప్పటివరకు లేకపోయినా పదేపదే వారి విడాకులు వార్తలు మాత్రం మీడియాలో, సోషల్ మీడియాలో చక్కెరలు కొడుతూనే ఉన్నాయి.ఇలాంటి సందర్భంలో మరో ఆసక్తికరమైన వ్యవహారంలో అభిషేక్ బచ్చన్ పేరు మీడియాలో మారుమోగుతోంది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్ ఆస్తులపై భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అయితే ఈసారి ఏకంగా ఒకటి రెండు కాదు ఏకంగా 10 అపార్ట్‌మెంట్లు కొన్నారు ఈ తండ్రీకొడుకులు. ముంబైలోని ములుండ్‌లో అమితాబ్-అభిషేక్ 10 అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేశారు. ఈ మొత్తం 10 అపార్ట్‌మెంట్ల మొత్తం ధర దాదాపు రూ.24.95 కోట్లు. ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల గురించిన సమాచారం కూడా తెర మీదకు వచ్చింది.ఒబెరాయ్ రియల్టీ ప్రాజెక్ట్ ఒబెరాయ్ ఎటర్నియాలో అమితాబ్ అభిషేక్ 10 అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఒబెరాయ్ ఎటర్నియా ప్రాజెక్ట్‌లో 3 BHK మరియు 4 BHK అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. ఇక అందుతున్న సమాచారం మేరకు బచ్చన్ కుటుంబం కొనుగోలు చేసిన ఈ 10 ఫ్లాట్లన్నీ 10,216 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. బచ్చన్ కుటుంబం 10 ఫ్లాట్లతో పాటు 20 కార్ పార్కింగ్ స్థలాలను కూడా కొనుగోలు చేసింది. 10 ఫ్లాట్లలో 8 కార్పెట్ ఏరియా 1049 చదరపు అడుగులు కాగా, మిగిలిన 2 అపార్ట్‌మెంట్ల కార్పెట్ ఏరియా 912 చదరపు అడుగులు. తండ్రీకొడుకులు 10 ఫ్లాట్లకు రూ.1.50 కోట్ల స్టాంప్ డ్యూటీ, రూ.3 లక్షల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. ఈ ఫ్లాట్లన్నీ అక్టోబర్ 9, 2024న రిజిస్ట్రేషన్ చేయబడ్డాయని తెలుస్తోంది. ఈ 10 ఫ్లాట్లలో 6 అభిషేక్ బచ్చన్ కొనుగోలు చేశారు, వాటి ధర రూ. 14.77 కోట్లు. అమితాబ్ బచ్చన్ 4 ఫ్లాట్లను కొనుగోలు చేశారు. ఇక అమితాబ్, అభిషేక్ బచ్చన్ 2020 -2024 మధ్య రియల్ ఎస్టేట్‌లో మొత్తం 200 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టారు.

# సినీ నటుడు అల్లు అర్జున్‌కి ఏపీ హైకోర్టులో ఊరట



ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ కు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే కారణంతో నంద్యాల పోలీసులు అల్లు అర్జున్ పై కేసు నమోదు చేశారు.తమపై నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి వేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఎఫ్ఐఆర్ ఆధారంగా నవంబరు 6 వరకు తదుపరి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశించింది. నవంబరు 6న తగిన ఉత్తర్వులిస్తామని హైకోర్టు తెలిపింది.ఆయన పర్యటనకు అధికారిక అనుమతులూ లేకపోయినా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని కొందరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అల్లు అర్జున్, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిలపై అప్పట్లో నంద్యాల రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# టాలీవుడ్ కి 'గుడ్ బై' చెప్పేసిన కృతి శెట్టి.. కనీసం అక్కడైనా కెరీర్ ఉంటుందా?

ఈమధ్య కాలం లో కొంతమంది కుర్ర హీరోయిన్స్ అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్ కి వచ్చేస్తున్నారు. కానీ దానిని కనీసం ఏడాది కూడా నిలబెట్టుకోలేక పోతున్నారు.సమంత కాజల్ అగర్వాల్, అనుష్క, తమన్నా వంటి హీరోయిన్స్ అందరూ కూడా తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ ని దక్కించుకున్నారు. కానీ వాళ్ళు ఎంతమంది కొత్త హీరోయిన్స్ వచ్చినా ఇప్పటికీ అదే రేంజ్ ని స్టేటస్ ని మైంటైన్ చేస్తున్నారు. కేవలం వీళ్ళను చూసి థియేటర్స్ కి కదిలే ఆడియన్స్ సంఖ్య లక్షల్లోనే ఉంటుంది. అలాంటి స్టేటస్ ని ఇప్పటి స్టార్ హీరోయిన్స్ ని దక్కించుకోలేకపోతున్నారు. ఎంత వేగంగా ఎదిగారో, అంతే వేగంగా క్రిందకి పడిపోతున్నారు.వరుస డిజాస్టర్ ఫ్లాప్స్ రావడంతో కనుమరుగు అయిపోతున్నారు.అలాంటి హీరోయిన్స్ లో ముందుగా మనం 'ఉప్పెన' హీరోయిన్ కృతి శెట్టి గురించి మాట్లాడుకోవాలి. ఈమెకు తొలి సినిమాతోనే స్టార్ స్టేటస్ వచ్చేసింది. చూసేందుకు ఎంతో అందంగా కనిపించింది, నటన కూడా అద్భుతంగా చేసింది. ఈ అమ్మాయికి భవిష్యత్తులో ఇక తిరుగే లేదని అందరూ అనుకున్నారు. 'ఉప్పెన' తర్వాత చేసిన చేసిన 'శ్యామ్ సింగ రాయ్', 'బంగార్రాజు' వంటి చిత్రాలు కూడా సూపర్ హిట్ అయ్యాయి. కానీ ఆ తర్వాత వచ్చిన సినిమాలన్నీ ఒకదానిని మించి ఒకటి ఫ్లాప్ అవుతూ వచ్చాయి. దీంతో ఈ అమ్మాయికి క్రేజ్ పూర్తిగా పడిపోయింది. స్టార్ హీరోలు తమ సినిమాల్లో అవకాశాలు ఇచ్చే సంగతి పక్కన పెడితే, కనీసం మీడియం రేంజ్ హీరోలు కూడా ఈమెను తమ సినిమాల్లో హీరోయిన్ గా తీసుకునేందుకు ఇష్టపడడం లేదు. ఈమె చివరిగా 'మనమే' అనే చిత్రం ద్వారా మన తెలుగు ఆడియన్స్ కి కనిపించింది. ఆ తర్వాత ఈమె పూర్తిగా తన మకాం మార్చేసింది. మలయాళం లో అనే చిత్రం చేసింది. ఇది కూడా కమర్షియల్ గా ఫ్లాప్ అయ్యింది. ఈ సినిమా తర్వాత ఆమెకు తమిళం లో మూడు సినిమాల్లో హీరోయిన్ గా నటించే అవకాశం వచ్చింది.'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ తో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', జయం రవితో 'జీనీ', కార్తీ తో 'వా వాతాయ్' అనే చిత్రాలు చేస్తుంది. ఈ మూడు సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. విడుదల అయ్యాక వీటిలో ఒక్క సినిమా సూపర్ హిట్ అయినా కృతి శెట్టి మళ్ళీ బౌన్స్ బ్యాక్ అయ్యినట్టే. ఇవి షూటింగ్ దశలో ఉన్న సమయంలోనే ఆమెకి హీరోయిన్ గా ఇంకా కొన్ని సినిమాల్లో నటించే అవకాశం వచ్చిందట. వాటిట్లో అజిత్ సినిమా కూడా ఉందని సమాచారం. టాలీవుడ్ లో ఎలాగో సక్సెస్ కాలేకపోయింది, ఇప్పుడు కనీసం కోలీవుడ్ లో అయినా ఈమె సక్సెస్ సాధిస్తుందో లేదో చూడాలి. ఒకవేళ అక్కడ సక్సెస్ అయితే, మళ్ళీ టాలీవుడ్ లో ఆమెకు అవకాశాల వెల్లువ కురవొచ్చు, చూడాలి మరి ఈమె భవిష్యత్తు ఎలా ఉండబోతుంది అనేది.

# దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్, బోర్డర్ గావస్కర్ ట్రోఫీ.. భారత్ జట్టును ప్రకటించిన బీసీసీఐ



టీమ్ఇండియా నవంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. నవంబర్ 8 నుంచి 15 వరకు 4 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారు కాగా..తాజాగా ఈ సిరీస్‌కు బీసీసీఐ జట్టును ప్రకటించింది. టీ20 జట్టు ఇదే: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రమణ్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, విజయ్‌కుమార్, అవేశ్ ఖాన్, యశ్ దయాల్ మరోవైపు భారత్ - ఆస్ట్రేలియా జట్ల మధ్య బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ (Border - Gavaskar Trophy 2024) నవంబర్ రెండోవారం నుంచి మొదలుకానుంది. ఈసారి ఐదు టెస్టుల సిరీస్ కావడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆసీస్ గడ్డపై హ్యాట్రిక్ సిరీస్ కొట్టాలనే లక్ష్యంతో భారత్ సిద్ధమవుతోంది. మరోవైపు ఈసారి ఎలాగైనా టీమ్ఇండియాకు చెక్ పెట్టాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. తాజాగా ఈ ట్రోఫీకి కూడా భారత్ జట్టును బీసీసీఐ ప్రకటించింది.బోర్డర్ గావస్కర్ ట్రోఫీ జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా, యశస్వి జైశ్వాల్, అభిమన్యు, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, సర్ఫరాజ్ ఖాన్, జురెల్, రవిచంద్రన్ అశ్విన్, జడేజా, సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, నితీశ్‌కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్

# చెలరేగిన అఫ్ఘానిస్థాన్..భారత్ లక్ష్యం 207




అల్ అమ్రత్: టీ20 వర్ధమాన జట్ల ఆసియా కప్‌లో భాగంగా సెమీఫైనల్-2 పోరులో అఫ్ఘానిస్థాన్, భారత్ జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది.ఓపెనర్లు జుబైద్ అక్బరి (64బీ 41 బంతుల్లో 5ఐ4, 6ఐ4), అటల్ (84బీ) అద్భుత ఇన్నింగ్స్‌తో శుభారంభాన్నిచ్చారు. భారత్ బౌలర్లలో రసిఖ్ దార్ సేలం 3 వికెట్లు పడగొట్టగా.. ఆకిబ్ ఖాన్ ఒక వికెట్ తీశాడు.బౌండరీతో ప్రారంభం ఇన్నింగ్స్ తొలి బంతికే అక్బర్ బౌండరీ బాది స్కోరు బోర్డును ముందుకు కదిలించాడు. ఆ తర్వాత నుంచి ఓపెనర్లు ఇద్దరూ వెనుదిరిగి చూడలేదు. క్రీజులో నిలదొక్కుకుంటూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ పటిష్ఠమైన ఇన్నింగ్స్ నిర్మించారు. 15 ఓవర్ల వరకు ఒక్క వికెట్ కూడా పడలేదంటే.. ఎంతలా క్రీజులో కూరుకుపోయారో అర్థమవుతుంది. భయంకరంగా మారిన ఈ జోడీని ఆకిబ్ ఖాన్ విడగొట్టాడు. 14.1వ బంతికి భారీ షాట్ ఆడిన అక్బరి..ప్రభ్‌సిమ్రన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే రసిక్ సలామ్ బౌలింగ్ అటల్ బౌల్డ్‌గా వెనుదిరిగాడు. జనత్ (41బీ20 బంతుల్లో 4ఐ4,2ఐ6) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

# రోహిత్ శర్మా.. వ్యూహం మార్చాలి కదా!: రవిశాస్త్రి



న్యూజిలాండ్‌తో పుణె వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్ ఆటతీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా కెప్టెన్ రోహిత్ శర్మ నిర్ణయాలపై క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే టీమ్ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ ఫీల్డింగ్‌ను సరిగా సర్దుబాటు చేయలేదని విమర్శించాడు. " అప్పటికే అధిక్యంలో కొనసాగుతున్న జట్టును కట్టడి చేయాలంటే.. వికెట్లు తీయడమే లక్ష్యంగా బౌలింగ్ ఉండాలి. అందుకు తగ్గట్టుగా ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్స్ ఉండాలి. కానీ, న్యూజిలాండ్ 85 పరుగులు చేసే వరకు భారత్ కేవలం 2 వికెట్లు మాత్రమే తీసింది. ఇక్కడ రోహిత్ శర్మ కెప్టెన్సీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది" అని రవిశాస్త్రి పేర్కొన్నాడు.తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసిన న్యూజిలాండ్ భారత్‌ను 156 పరుగులకే ఆలౌట్ చేసి.. 103 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఈ పరిస్థితుల్లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆ జట్టును కనీసం 120 పరుగులకు కట్టడి చేసే విధంగా టీమ్ ఇండియా వ్యూహం పన్నినట్లయితే..విజయావకాశాలు ఎక్కువగా ఉండేవని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. " న్యూజిలాండ్ ఒక్క వికెట్ కోల్పోకుండా 60 పరుగులు చేసినప్పుడే రోహిత్ శర్మ తన వ్యూహాన్ని మార్చాల్సింది. ఔట్ ఫీల్డ్‌లో ఆటగాళ్లను మోహరించి.. పరుగులను తగ్గించే ప్రయత్నం చేయకుండా.. ఇన్‌ఫీల్డ్‌లో ఉంచి వికెట్లు తీసే ప్రయత్నం చేయాల్సింది. వెంట వెంటనే వికెట్లు పడితే వాళ్లపై ఒత్తిడి పడుతుంది. ఫలితంగా పరుగులను కట్టడి చేసేందుకు వీలుంటుంది" అని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు.

# ముగిసిన రెండో రోజు ఆట.. భారీ ఆధిక్యంలో న్యూజిలాండ్



పుణే టెస్టులోనూ టీమిండియాకు కష్టాలు తప్పలేదు. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 156 పరుగులకే కుప్పకూలగా.రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన న్యూజిలాండ్ భారీ ఆధిక్యంపై కన్నేసింది.కాగా.. భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. దీంతో.. భారత్‌పై న్యూజిలాండ్ 301 పరుగుల ఆధిక్యం సాధించింది. కివీస్ కెప్టెన్ లాథమ్ 86 పరుగులతో రాణించారు. విల్ యంగ్ (23), డేరియల్ మిచెల్ (18) పరుగులు చేశారు. ప్రస్తుతం.. గ్లెన్ ఫిలిప్ 9, టామ్ బ్లండెల్ 30 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ సుందర్ 4 వికెట్లు పడగొట్టాడు. అశ్విన్ ఒక వికెట్ తీశాడు.రెండో టెస్టులో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసింది. ఆ తర్వాత టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే కుప్పకూలింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగుల ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ బౌలింగ్‌లో మిచెల్ సాంట్నర్ తన కెరీర్‌లో తొలి 5 వికెట్లు పడగొట్టి మొత్తం 7 వికెట్లు సాధించాడు. కాగా.. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో రవీంద్ర జడేజా 38 పరుగులతో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు.




తెలంగాణ
శాసనసభ
తెలుగు దినపత్రిక

జిల్లా అనుబంధం

|| శనివారం 26 అక్టోబర్ - 2024 || పేజీలు : 4

# నవంబర్ 7న రంగారెడ్డి జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక



## - కలెక్టర్ శశాంక వెల్లడి

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 7న రంగారెడ్డి జిల్లాకు విచ్చేయనుందని కలెక్టర్ శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్ గిరి, వికారాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 7న రంగారెడ్డి లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్,బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ కు నివేదించవచ్చని కలెక్టర్ సూచించారు.

# సాయినాథుని సేవలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్





**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** చింతపల్లి మండల పోలీస్ స్టేషన్లో "మీట్ యువర్ ఎస్పి" అనే కార్యక్రమానికి నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హాజరైనా నేపథ్యంలో ముందుగా శనివారం నాడు చింతపల్లి సాయినాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితులచే ఆశీర్వచనం తీసుకున్న అనంతరం కొంత సమయం గోమాతలను సేవించి, ఆలయ పరిసరాలను, మౌలిక వసతులను పరిశీలించి అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందారు. ఈ సందర్భంగా సాయి సన్నిధి ఆలయ ట్రస్ట్ చైర్మన్ మంచి కంటి ధనంజయ, కమిటీ సభ్యులు మొదటి సారిగా జిల్లా ఎస్పీగా చార్జ్ తీసుకున్న తర్వాత చింతపల్లికి వచ్చి సాయినాథుని దర్శించుకున్నందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి సాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తలకమళ్ళ శ్రీనివాస్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేత



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** ఇబ్రాయింపట్నం మండలం (పెత్తుల్ల)తూలేకలాన్ గ్రామానికి చెందిన యువత జిల్లా గ్రంథాలయ చైర్మన్ అలుగంటి మాదుసూదన్ రెడ్డి ని కలసిన యువత గ్రంథాలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని శుక్రవారం వినతి పత్రం ఇవ్వడం జర్గింది. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మాదుసూదన్ రెడ్డి మాట్లాడుతూ యువత కోసం పెత్తుల్లలో గ్రంథాలయ నిర్మాణానికి నిధులు కేటాఇస్తానని ఈ సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రములో ఇబ్రాయింపట్నం మండల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెండ్ కోడూరి రమేష్, సత్తు శేషాంక్ రెడ్డి, గ్రామ అధ్యక్షలు కోడూరి పండు, దోమ సుదర్శన్ రెడ్డి, సత్తు నారన్ రెడ్డి, బోడ మహేందర్, బోడ విజయ్, మనోహర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రభు, జక్కుల మల్లేష్,కోడూరి విరేష్,శంకర్, రాజు, వెంకటేష్, మహేష్ సాయి, మహేష్,మల్లేష్, శివ, మహేందర్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీశాంత్, బుగ్గారములు ,యాదయ్య, అంజయ్య, గ్రామ పెద్దలు తదితరులు పొల్గొన్నారు.

# 33 కోర్సులను ప్రక్షాళన చేసి విద్యార్థులకు అందిస్తాం



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** గత ప్రభుత్వం పదేళ్లలో 40 వేల ఉద్యోగాలివ్వలేదని విమర్శించారు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ..కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 50 వేల పై చిలుకు ఉద్యోగాలుచ్చామని ఆయన తెలిపారు. గ్రూప్ 1 పరీక్షకు ముందు విద్యార్థులను రెచ్చగొట్టి బీఆర్ఎస్ పరీక్షలను అడ్డుకునే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. గడిచిన పదేళ్లలో టెక్నికల్ వ్యవస్థలు మూలనపడ్డాయని, ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం పై ప్రత్యేకమైన శ్రద్ధగా పెట్టిందని, పాలమూరులో రెండు ఏటీసీ ( అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్స్) ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. యువతలో నైపుణ్యాన్ని పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. పాలమూరులో స్కిల్ యూనివర్సిటీ విభాగం ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్యాలు అందిస్తామని,గత ప్రభుత్వం యూనివర్సిటీల కు వీసీలను నియమించలేదని మండిపడ్డారు. యూనివర్సిటీలో ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటు ద్వారా పరిశ్రమలు అనుసంధానం చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, టాటా టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. 33 కోర్సులను ప్రక్షాళన చేసి విద్యార్థులకు అందిస్తామని,బీఏ,బీకాం చదివే విద్యార్థుల కు బ్యాంకింగ్,ఫైనాన్షియల్ కోర్సులను జోడించి నైపుణ్యం కల్పిస్తామన్నారు. విద్యార్థుల పరిశోధనలకు తోడ్పాటు నందిస్తామని ఆయన వెల్లడించారు. పారిశ్రామీకరణకు విద్యను అనుసంధానం చేస్తామని, విద్యార్థుల భవిష్యత్తుకు మాది బాధ్యత.. పాలమూరు జిల్లా సీఎం జిల్లా. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# నేడు పాషా నరహరి వర్ధంతి సభను జయప్రదం చేయండి

## శాఖ కార్యదర్శి సిహెచ్ సత్యం




**యాచారం శాసనసభ న్యూస్ (అక్టోబర్ 25) :** పేద ప్రజల కోసం ప్రాణాలను మహబూబ్ పాషా నరహరి 35వ వర్ధంతి సభను సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. 1989 అక్టోబర్ 26 రాత్రి 9 గంటలకు అది మరపురాని రోజు. పేదల బతుకులో దుఃఖం ఎగచిమ్మిన రోజు, కష్టజీవుల గుండెలు రగిలి కన్నీరైన రోజు, రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, జపాల గ్రామమంలో పుట్టి పెరిగి చిన్నతనం నుండే కష్టాలను చూసి వాటిని ఎదుర్కొనేందుకు ఎర్రజెండాను అందుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో గ్రామ గ్రామాన తిరిగి ప్రజలను కూడగట్టి సంఘం పెట్టి కూలిపోరాటాలు ముందున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో ప్రతి పేదోడికి ప్రభుత్వ భూములు ఎర్రజెండా నాయకత్వను వేలాది ఎకరాల భూమిని పంచారు. సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకత్వం మహబూబ్ పాషా ను రంగారెడ్డి జిల్లా ఉద్యమానికి అవసరమని పార్టీ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు కూడా స్వీకరించారు. పార్టీ చెప్పిన పద్ధతిలో ప్రజలలో మమేకమై పనిచేశారు. నియోజకవర్గంలో సిపిఎం పార్టీ నువ్వా నేనా అన్నట్లు పార్టీ బలంగా పెరిగింది. ఆ తరుణంలోనూ మంచాల మండలం ఎంపీపీ అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి పోటీ పడుతున్న సమయంలో హైదరాబాదు నుండి కామ్రేడ్ నరహరి చదువుకుంటున్న యువకుని తీసుకొచ్చి ఎంపీపీ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. భారీ మెజార్టీతో నరహరి గెలుపొందారు. వేలాది మంది ప్రజలు యువతీ యువకులు సిపిఎం పార్టీ వైపు ఆకర్షితులే చేరారు. కాంగ్రెస్ పార్టీ ధీటుగా సిపిఎం పార్టీ ఎమ్మెల్యే పోటీ చేయడానికి బలం పెరిగింది. కానీ అదే సమయంలో



నల్లగొండ జిల్లా మిర్యాలగూడ లో డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు యువతి యువకులను తీసుకెళ్లేందుకు రాత్రి సమయంలో ఇబ్రహీంపట్నం నుండి జాపాలకు వెళుతున్న సమయంలో దారికాసి లింగంపల్లి గేటు కాడ కాంగ్రెస్, బిజెపి గుండాలు పాషా నరహరి లను కత్తులు ,గొడ్డన్ల తో అతి దారుణంగా నరికి పెట్రోల్ పోసి ఇబ్రహీంపట్నం చెరువులో వేసి పోయారు. రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉవ్వెత్తును ఉగ్రరూపమై , పార్టీ రాష్ట్ర నాయకత్వం సిపిఎం పార్టీ నాయకులు ఎంతమంది చనిపోయిన పేద ప్రజల కోసం కృషి పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ అప్పటినుండి ఇప్పటివరకు ఎర్రజెండా ముందుకే సాగుతుంది.గ్రామ గ్రామాన పాషా నరస వర్ధంతి చింతపట్ల నూతన కార్యదర్శిగా సిహెచ్ సత్యం మాట్లాడుతూ.. పాషా నరహరి మన మధ్యలో లేకున్నా పేద ప్రజల్లో ఆయన చేసిన సేవలను, ఎర్రజెండా నాయకత్వాన్న వేలాది ఎకరాలను భూములు పంచిన చరిత్ర ఆయనది. సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఘనంగా వర్ధంతి సభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# చింతపట్ల లో విహెచ్పిఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

## అధ్యక్షులుగా బండ అయిలయ్య

**యాచారం శాసనసభ న్యూస్ ( అక్టోబర్ 25):.** మండల పరిధిలో చింతపట్ల గ్రామంలో వి హెచ్పిఎస్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం అధ్యక్షులుగా బండ ఐలయ్య ఎంపిక చేశారు. శుక్రవారం విహెచ్పిఎస్ మండల అధ్యక్షుడు దేరంగుల ఈశ్వర్ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ కార్యదర్శి పింఛన్ దారులందరికి నీటి వసతి ఏర్పాటు చేయాలని కోరారు. వేలిముద్రలు రానివారికి సెక్రటరీ గ్రామపంచాయతీ ఎన్ని పనులున్న పక్కన పెట్టి పెన్షన్ దారులకి ప్రాముఖ్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యను పరిష్కారం కోసం ప్రతి ఒక్క కృషి చేయాలని



సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాచారం జంగయ్య, ఉపాధ్యక్షులు ఎండి సలీం తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్ని వధువరులను ఆశీర్వాదించిన చైర్ పర్సన్



**చండూర్ అక్టోబర్ 25 (శాసనసభ న్యూస్) :** శుక్రవారం రోజున చండూర్ మండలం ఉడత్తలపల్లి గ్రామానికి చెందిన పర్సనబోయిన యాదయ్య కుమారుని వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన చండూరు మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్నతో కావాలి అంజనేయులు,మేకల ఆంజనేయులు, తోకల శీను, పర్సనగౌని నరసింహ,కట్ట అశోక్, పర్సనబోయిన చంద్రం,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో అక్రమ మద్యం, గంజాయి, గుడుంబా

## నిర్మూలనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### - నాంపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి

**నాంపల్లి, శాసనసభ అక్టోబర్ 25 :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నాంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు అక్రమ మద్యం, గంజాయి, గుడుంబా, వివిధ రకాల మత్తు,మాదకద్రవ్యాల నిర్మూలనకై నాంపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున మహిళలు, పురుషులు, యువత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కత్తి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా గ్రామాలలో నాటుసార, గంజాయి, తయారుచేసినా కలిగి ఉన్నా, రవాణా చేసినా, అమ్మినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఎక్కడైనా అక్రమంగా అక్రమంగా మద్యం తరలించి తయారుచేసినా ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేరు సంబంధిత అధికారులు గోప్యంగా



ఉంచుతారని, గంజాయి గుడుంబా డ్రగ్స్ నిర్మూలన కొరకు మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల మాజీ ఎంపిటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు మెంబర్లు , గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందని,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, సోదరులకు ప్రతి ఒక్కరికి కత్తి రవీందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే

# “మీట్ యువర్ ఎస్పీ” కార్యక్రమం

### - ప్రజల నుండి వినతులు స్వీకరించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.





**చింతపల్లి,శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కొరకే ప్రజల వద్దకు వెళ్లి పరిష్కరించే విధంగా ఉండాలని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం నాడు చింతపల్లి మండలంలోని పోలీస్ స్టేషన్ ఆయన సందర్శించి, పెండింగ్లో ఉన్న కేసులను చూసి సుదూర ప్రాంతాల ప్రజలకు మండల స్థాయిలోనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీస్ స్టేషన్లో సిబ్బంది పనితీరు పోలీస్ స్టేషన్ పరిసరాలు, కేసులకు సంబంధించిన రికార్డులను అడిగి తెలుసుకున్నారు.లాకప్ ఎస్ హెచ్ ఓ రూమ్ పరిశీలించారు. ప్రజలు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలు తీర్చాలని ప్రజాఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందిస్తూ బాధితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ సిబ్బంది పనిచేయాలని, సామాన్యుడు పోలీస్ స్టేషన్ కు వస్తే తగు న్యాయం జరుగుతుందని నమ్మకం కలగజేసి, పని చేయాలని అప్పుడే ప్రజలలో పోలీసులపై నమ్మకం వస్తుందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో త్వరగా ముగించాలని అన్నారు. అనంతరం బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చింతపల్లి మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి స్వయంగా కలిసి దరఖాస్తులు అందజేశారు. ప్రజలకు చేరువయ్యేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ లను సందర్శిస్తానని ఆయన అన్నారు. స్వీకరించిన దరఖాస్తులను వెంటనే సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డిఎస్పి గిరిబాబు నాంపల్లి సిఐ నవీన్ కుమార్, చింతపల్లి ఎస్సై యాదయ్య, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాపాల గ్రామానికి 28 ఎల్ఈడీ లైట్లు మంజూరు




**మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** మంచాల మండలం జాపాల గ్రామానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి 28 ఎల్ఈడీ లైట్లు అందజేశారు. శనివారం నాడు జాపాల గ్రామపంచాయతీ వద్ద కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సొప్పరి దశరథ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎల్ఈడి లైట్లు బిగించే కార్యక్రమ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు దశరథ మాట్లాడుతూ జాపాల గ్రామానికి ఎల్ఈడి లైట్లు అడిగిన వెంటనే మంజూరు చేయించినందుకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి జాపాల గ్రామ ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సొప్పరి దశరథ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలియజేశా రు, స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి మర్రి



నిత్య నిరంజన్ రెడ్డి సహకారంతో దశలవారీగా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సాయ శక్తులాకృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ ఆవుల మల్లేష్, ఓరుగంటి మహేష్ గౌడ్,మాదరమోని వెంకటేష్ ముదిరాజ్,మంథని మల్లేష్ యాదవ్, గ్రామపంచా యతీ సిబ్బంది జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి, పెండ్లిపాకల గ్రామాలలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్లు

## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి.



**కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ అక్టోబర్ 25 :** గురువారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పెండ్లిపాకల గ్రామంలో శిక్షణ ఐఏఎస్ అధికారులు పర్యటించి అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. గ్రామలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ట్రైనీ కలెక్టర్లకు వివరించిన కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి. అనంతరం శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడి శేఖర్ రెడ్డి, ఎంపీడీవో బాలరాజు రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## - గజమాలవేసి శాలువాతో సత్కరించిన లయన్ కె.వి రమేష్ రాజు.

**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి ఎం. పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు లయన్ కె.వి.రమేష్ రాజు. శాలువా, గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈఎస్ శేఖర్ రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణ రాజు, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మెంబెర్ రఘుపతి రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

## ధర్మ సమాజ్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు నేరళ్ళ లింగయన్

**చండూర్ అక్టోబర్ 25 (శాసనసభ న్యూస్) :** మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 3న కార్యకర్తల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 90% శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ పీడిత ప్రజల ఆత్మగౌరవం, అధికారం కోసం అగ్రకుల భూస్వామ్య వ్యవస్థ పై తిరుగుబాటు చేయడానికి 2023 మార్చి 15వ తేదిన ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. ఇప్పటికీ అణగారిన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అనే మౌలిక అంశాలు ఎక్కడ అందడం లేదన్నారు. అణగారిన వర్గాల జీవితాలు మార్చడానికి ధర్మ సమాజ్ పార్టీ రాజకీయ వేదిక ఏర్పడిందని తెలిపారు. పార్టీ నిర్మాణం సమీక్ష భవిష్యత్తు కార్యచరణ కోసం ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనాన్ని నిర్వహించబోతుందని,మండల కేంద్రంలో ఉన్న కార్యకర్తలు బి.సి.,



ఎస్.సి., ఎస్.టి., డి.ఎఫ్.సి., ఆర్.ఎమ్.,ప్రజలు నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. మహాసమ్మేళనం అనంతరం భారీ సమాజిక పోరాటానికి పార్టీ సిద్ధమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా అధ్యక్షులు పొట్టిపాక శ్రీనివాస్, మండల కొకన్వీనర్ శ్రీశైలం, మండల ముఖ్య నాయకులు రాజేష్, సుమన్, మహేష్, శంకర్, వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు.

# భారత్ యువసేన మహేష్ గాడ్సే ఆమరణ నిరాహార దీక్ష

**చండూరు అక్టోబర్ 25 (శాసనసభ న్యూస్) :** శుక్రవారం రోజు చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని చౌరస్తాలో భారత్ యువసేన మహేష్ గాడ్సే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చండూరు పట్టణంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివినా లేదా చదువుకుంటున్న ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు వేల రూపాయల ఫీజులు కట్టడానికి పడుతున్న ఆర్థిక ఇబ్బందులను చూసి నా గుండె చలించిందని,మునుగోడు నియోజకవర్గంలో చండూరు డివిజన్ అయింది. కానీ ఎన్నికల ప్రచారంలో నామినేషన్ వేయడానికి పనికి వచ్చే చండూరు మున్సిపాలిటీ విద్యాసంస్థలు తేవడానికి చదువు చెప్పడానికి ఎందుకు పనికి వస్తలేదు. ప్రైవేటు విద్యాసంస్థల్లో నలిగిపోతున్న పేద విద్యార్థులను కాపాడడానికి ఈ ప్రభుత్వం పని చేయడం లేదు.మునుగోడు నియోజకవర్గంలో అన్ని మండలాలకు మోడల్ స్కూల్ ఉన్నాయి. కానీ ఒక్క చండూరు మండలానికి మాత్రమే వచ్చిన మోడల్ స్కూల్ ని ఏదో రకంగా ఇంకొక మండలానికి పంపివేయడం, ఏ ప్రభుత్వ విద్యా సంస్థలు రాకుండా చేయడం, ఉన్న ప్రభుత్వ పాఠశాల కూడా శిథిలావస్థలో




ఉండడం డిగ్రీ కాలేజీని ఎవరైనా చూసినా డిగ్రీ కాలేజ్ అనరు. ఈరోజు అవకాశం ఉన్న ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల అయినా చండూరుకు తరలించాలని పేద విద్యార్థులందరికీ ప్రవేటు విద్యాసంస్థల ఫీజుల భారం నుండి & ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ నుండి కాపాడాలని సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మరియు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఒక్క ప్రైవేటు విద్యాసంస్థ కూడా 25 శాతం రిజర్వేషన్లు నిరుపేద విద్యార్థులకు కల్పించడం లేదు అన్నారు. ఈ ఫీజుల నియంత్రణ చేపట్టకుండా చండూరు పట్టణంలో ప్రైవేటు విద్యాసంస్థలు కొనసాగుతున్నాయో ప్రభుత్వం పరిశీలించాలని అన్నారు.

# గాదరి కిషోర్ నోరు అదుపులో పెట్టుకో... ఖబడ్దార్

## మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు పగిడిమర్రి నవీన్ కుమార్

**చండూర్ అక్టోబర్ 25 (శాసనసభ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పై దొంగ నోట్ల దొంగ గాదరి కిషోర్ కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. అనుచిత వ్యాఖ్యలు వెంటనే విరమించుకొని భేషరతుగా క్షమాపణలు చెప్పాలని మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు పగిడిమర్రి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. శాసనసభ ప్రతినిధునితో మాట్లాడుతూ దొంగ నోట్ల ముద్దాయి మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. అక్కడ ఉన్నది వెంకట్ రెడ్డి నీలాగా అక్రమాలు అత్యాచారాలు చేసిన వ్యక్తి కాదు బిడ్డ మళ్ళీ నోరు జారితే నాలుక చిలుస్తాం అని విమర్శించారు. ప్రభుత్వ పాలనలో ఏవైనా లోపాలు



ఉంటె ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న పార్టీలు లోపాలను ఎత్తి చూపి వాటిని మార్చుకునే విదంగా ప్రభుత్వానికి సూచనలు ఇస్తే స్వాగతిస్తాం కానీ అవినీతి చేసి సంపాదించినా డబ్బు మదంతో నువ్వు నోటికి ఎంతోస్తే అంత మాట్లాడుతుండడం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనిస్తున్నారని అన్నారు. మీరు సక్కగా పాలిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయే వాళ్ళో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి కానీ ప్రజాపాలన చేస్తున్న ప్రభుత్వం పై,మంత్రులపై తీవ్రమైన పదజాలాలతో దూషించడం సిగ్గుచేటని అన్నారు. ఇకనైనా మీరు,మీ అలవాట్లు, మీ పదజాలం మారకుంటే రాష్ట్ర ప్రజల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి గురి కావడం తప్పదని హెచ్చరించారు.

# కుటుంబ సభ్యులను పరామర్శించిన - చైర్ పర్సన్



**చండూర్ అక్టోబర్ 25 (శాసనసభ న్యూస్) :** శుక్రవారం రోజున చండూర్ మండలం పడమటితల్ల గ్రామం లో గుండెగోని మల్లయ్య తెలవారుజామున మరణించిచారు. పార్థివాదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించిన చండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్నతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్రం మాదవి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావాలి మంగమ్మ ప్రసాద్, కావాలి యాదయ్య, మాజీ సర్పంచ్ బొమ్మరబోయిన వెంకటేశం, గాలెంక రాంబాబు , తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన-మాదగోని నరేందర్ గౌడ్



**చండూర్ అక్టోబర్ 25 (శాసనసభ న్యూస్) :** శుక్రవారం రోజున దరేశ్విపురం లో నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తులకు అన్నదానం చేసి మంచి మనస్సు చాటుకు బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్.

## చింతపల్లి మార్కెట్ యార్డులో 27న ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** చింతపల్లి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఈనెల 27న వనస్థలిపురం ప్రసాద్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రసాద్ హాస్పిటల్ చైర్మన్ చైతన్య రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, వయో వృద్ధులు వితంతువులు,వికలాంగులు,ఈఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైద్య శిబిరంలో డయాబెటాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ,ఆర్థోపెడిక్స్, పీడియాటిక్స్, జనరల్ సర్జరీ, తదితర విషయాలపై వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.మండలంలోని ప్రతి ఒక్కరు పరీక్షల అనంతరం ఉచిత మందులు కూడా పంపిణీచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నల్లగొండ పార్లమెంట్ సభ్యులు ఎంపీరఘువీర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, తదితర నాయకులు హాజరు కానున్నారని తెలిపారు.

# వరంగల్ -ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికలలో నర్సిరెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు కల్పించాలి

**చండూర్ అక్టోబర్ 25 (శాసనసభ న్యూస్) :** మర్రిగూడ మండలం ఆదర్శ పాఠశాల లో శుక్రవారం భోజన విరామ సమయం లో జరిగిన ప్రచార కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మర్రిగూడ మండల అధ్యక్షులు నాగవరం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఉపాధ్యాయుల సమస్యల కొరకు నిరంతరం పనిచేస్తూ, శాసన మండలిలో పారిశుద్ధ్య కార్మికుల సమస్య, న్యాయపరమైన సమస్యలు పరిష్కరించుటలో వివిధ కేటగిరిలలో ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల పరిష్కారానికి తన వంతు కృషి చేయడం జరిగిందని తెలిపారు.మొదటి ప్రాధాన్యత ఓటు నర్సిరెడ్డి కి వేసి గెలిపించాలని, ఆన్లైన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమం త్వరిరతగతిన పూర్తి చేయాలని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో మండల యుటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పున్న కృష్ణయ్య, యుటిఎఫ్ మర్రిగూడ స్కూలు కాంప్లెక్స్ కన్వీనర్ బి.శ్రీనివాస్,




మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రజియొద్దీన్,వెంకటేష్ గౌడ్, లింగస్వామి, శ్రీనివాస్, వెంకటయ్య, విజయ, సబిత, దోరతి,నాగమనీషా ,కోమలి, భవాని, అనురాధ, సూర్య కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

## - రెండు తులాల బంగారం, 50,000 నగదు అపహరణ.

**ఆదిభట్ల శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** ఆదిభట్ల పరిధిలోని కర్మల్ గూడలో గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 16వ తేదీన ఓ ఇంట్లో బంగారం, నగదు అపహరించిన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శనివారం నాడు పోలె కృష్ణ, తండ్రి గోపాల్, తిరుమల నగర్ కాలనీ, కుర్మల్గూడ అను వీరి దగ్గర నుండి ఆదిభట్ల పోలీస్ స్టేషన్ కు 100 డయల్ కు ఫోన్ చేశారన్నారు. వెళ్లి విచారించగా కుటుంబ కార్యక్రమాల నిమిత్తం ఈనెల 16 వ తేదీన తనఇంటి నుంచి జిల్లెళ్లగూడకు వెళ్లి శు



క్రవారం 25వ తేదీ తిరిగి రాగా, గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి 2 తులాల బంగారం (నల్లపూసలు, ముక్కుపుడక) దోచుకెళ్లినట్లు తెలిసిందన్నారు. అల్మారా నుండి సుమారు రూ.50,000/- వేల రూపాయల నగదును దొంగిలించారు. ఇంటీరియల్ ప్లేస్‌లో ఉన్న ఈ ఇల్లును సి ఐ రాఘవేందర్ రెడ్డి, సెక్టార్ ఎస్ఐ పి.రాజు, క్రైమ్ టీమ్, క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించామని, ఆచూకీ కోసం క్రైమ్ టీమ్ సీసీటీవీలను చూస్తున్నారని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

# మరణించిన బెల్లి సత్తయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామానికి చెందిన బెల్లిసత్తయ్య ఇటీవలే మరణించడం జరిగింది. బెల్లి సత్తయ్య కుటుంభం ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలిసి, నలుగురు కుమార్తెలు పేదవారు కావడంతో వారికి కురుమ సంఘం తరఫున వారి కుటుంబానికి తోచినంత సహాయం చేయడం జరిగింది. కుటుంబ పెద్ద చనిపోవడం ఆ కుటుంబానికి తీరని లోటు అని కురుమ సంఘం సోదరులు అన్నారు. ఈ నగదును గురువారం సాయంత్రం బెల్లి సత్తయ్య భార్య అయిలమ్మకు 43,000 రూపాయల చెక్కును శుక్రవారం నాడు కురుమ సంఘం తరఫున అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కురుమ యాదవ సంఘం అధ్యక్షుడు కొట్టాముల శ్రీనివాస్, పట్నం భాష ,కొట్టాముల శ్రీశైలం ,పట్నం కొండయ్య, సూద కృష్ణ, కొలను రాజు ఆసనగారి రంజిత్, బజారుబిక్షపతి, సల్తాని భాష తదితరులు పాల్గొన్నారు,

## 27 న చింతపల్లి మండల యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక సమావేశాన్ని విజయవంతం చేయండి

### - మాజీ జెడ్పిటిసి జంగిటి నరసింహ్మా.




**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 25 :** చింతపల్లి మండల కేంద్రంలో ఈనెల 27 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు చింతపల్లి మండల కేంద్రంలోని సాయిసుమంగళీ గార్డెన్లో చింతపల్లి మండల అఖిలభారత యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏర్పాటు చేయడం జరుగుతుంది కావున మండలంలోని వివిధ గ్రామాలనుండి భారీ సంఖ్యలో యాదవ సోదరులు తరలివచ్చి యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నికను విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నట్టు మాజీ జెడ్పిటిసి జంగిటి నరసింహ్మా యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్ల వెంకటయ్య యాదవ్,దాసరి శ్రీనివాస్ యాదవ్ ,శివర్ల రమేష్ యాదవ్,పల్ల వెంకటయ్య యాదవ్,గుణమోని కొండల్ యాదవ్,దాసరి నిరంజన్ యాదవ్,బి.రాములు యాదవ్,ముడిగ వెంకటయ్య యాదవ్,దాసరి రాజు యాదవ్, గంగల వెంకటయ్య యాదవ్,గొడుగు శ్రీనివాస్ యాదవ్, మాడం వెంకటయ్య యాదవ్, శ్రీశైలం యాదవ్,బినమోని సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.